మందమర్రి రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి.. పెద్దపల్లి ప్రగతి నివేదన సభకు భారీగా హాజరైన ప్రజలు, పార్టీ నాయకులు

కర్ణాటక సొమ్ముతో తెలంగాణను కొనలేరు

- 60 ఏండ్లు సావగొట్టినోళ్లు ఇప్పుడు గ్యారెంటీలంటున్నరు
- కాంగ్రెస్ గ్యారెంటీ వందేండ్ల క్రితమే ముగిసింది
- మేకల మందకు తోడేళ్ల కాపలా వద్దు
- సింగరేణిలో బద్దలవుతున్న రికార్డులు
- మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో జరిగిన బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్



రామగుండంలో ఖురూజ్‌కమ్మీ భూముల పట్టాలు అందిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్



పెద్దపల్లి సభలో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మంచిర్యాల/ కరీంనగర్ అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కర్ణాటకలో బిల్డర్ల నుంచి వసూలు చేసే సొమ్ముతో తెలంగాణ ప్రజలను కొనాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించబోవని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో జరిగిన బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించిన కారు గుర్తు నాయకుడు ఇటువైపు.. దశాబ్దాల సమస్యను అట్లే విడిచిపెట్టిన బేకార్ గాళ్లందరు అటు దిక్కున ఉన్నారని అన్నారు. ఎన్నికలు రాగానే ఆగం కావొద్దని.. ఎక్కడ ఎవరు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలను కోరారు. ఇటీవల బెంగళూరు నుంచి కొందరు వచ్చి తనను కలిశారని, కర్ణాటకలో బిల్డర్ల దగ్గర చదరపు అడుగుకు రూ. 500 చొప్పున వసూలు చేస్తున్న అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆపైసలతో ఇక్కడి ప్రజలన్ని కొనేసి ఆగం చేయాలని చూస్తున్నదని చెప్పారని కేటీఆర్ తెలిపారు. మా తెలంగాణ అమ్ముడుపోయేది కాదని తాను వారితో చెప్పానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ వందలకోట్ల దొంగసొమ్ము తెచ్చినా తిప్పికొడదామని పిలుపునిచ్చారు. కర్ణాటక నుంచో, ఢిల్లీ నుంచో తెచ్చి పంచే పైసల్ని బరాబర్ తీసుకోవాలని, కానీ ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని కోరారు. 60 ఏండ్లపాటు మనకు తాగునీరు, కరెంటు లేకుండా సావగొట్టిన కాంగ్రెస్ ఈరోజు మళ్లీ వచ్చి మాటలు చెబుతున్నదని మంత్రి కేటీఆర్ విమర్శించారు. వారిని నమ్మితే కుక్క తోక పట్టుకుని గోదారి ఈదినట్టేనని, మేకల మందకు తోడేళ్లను కాపలాపెట్టుకున్నట్టే అవుతుందని హెచ్చరించారు. ఆరు దశాబ్దాలు సావగొట్టినోళ్లు ఇవాళ వచ్చి గ్యారెంటీ అంటే నమ్మి ఆగం కావొద్దని సూచించారు. 150 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ 100 ఏండ్ల క్రితమే ముగిసిందని తెలిపారు. వారు ఇచ్చే ఆరు హామీలు ఏమోగానీ.. మూడు గంటల కరెంటు మాత్రం పక్కా అని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికుల జంగ్ సైరన్‌కు రాష్ట్రాలే దిగొచ్చాయి

స్వరాష్ట్రంలో సింగరేణి అభివృద్ధిలో దూసుకెళ్తున్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈసారి దీపావళికి సింగరేణి కార్మికుల ఖాతాల్లో ఏకంగా రూ.1000 కోట్లు పడుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధికి పాటుపడుతున్నది ఒక్క సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. నాడు సింగరేణి కార్మికులు జంగ్ సైరన్ ఇస్తే దక్షిణాది రాష్ట్రాలు దిగివచ్చాయని, దెబ్బకు అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి దిగివచ్చే పరిస్థితి సృష్టించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ 14 హామీలు ఇస్తే అన్నింటినీ అమలు చేశారని తెలిపారు. కేసీఆర్ ఉద్యమ జెండా ఎగరేసినప్పటి నుంచి పోరాటానికి అండగా నిలిచింది సింగరేణి, ఆర్టీసీ కార్మికులేనని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో సింగరేణి దశ తిరిగిందని, నవరత్నాలు, మహారత్నాలకు దీటుగా బ్రహ్మాండగా వెలుగుతున్నదని అన్నారు. ఉత్పత్తి, లాభాల్లో సింగరేణి రికార్డులను బద్దలు కొడుతున్నదని కొనియాడారు. 2014లో లాభాలు 419 కోట్లు ఉంటే ఈరోజు రూ.2,222 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు.

అప్పుడు 18శాతం.. ఇప్పుడు 32శాతం

అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లాభాల్లో 18 శాతం మాత్రమే కార్మికులకు వాటా ఇస్తే.. ఇప్పుడు చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో 32 శాతం వాటా ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు. రూ.711 కోట్లను ఈసారి లాభాల్లో వాటాను కార్మికులు అందుకుంటున్నారని తెలిపారు. దీంతోపాటు దీపావళి బోసన్ కలుపుకొని చూస్తే రూ.1000 ఒకే సంవత్సరంలో కార్మికుల ఖాతాల్లో పడుతున్నాయన్నారు. సింగరేణి కార్మికులపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ, కమిట్‌మెంట్, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలన్న ఆలోచన దేశంలో ఏ నాయకుడికైనా ఉందా? రాహుల్ గాంధీకి ఉందా? నరేంద్రమోదీకి ఉందా? ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా సీఎం కేసీఆర్ వాటిని అధిగమించి 15,400 వారసత్వ ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. 520 మంది డిస్మిస్డ్ కార్మికులను వెనక్కి తీసుకున్నామని గుర్తు చేశారు. వీటితోపాటు కొత్తగా నాలుగువేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఒక్క రామగుండం నియోజకవర్గంలోనే 576 ఎకరాల్లో 5 వేల మందికి పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది కాదా? రామగుండం నియోజకవర్గానికి మెడికల్ కళాశాల వస్తుందని అనుకున్నారా? అని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల బిడ్డలు ఈరోజు కార్మికులే కావాల్సిన అవసరం లేదని, డాక్టర్లు కావాలంటే.. మీ పరిధిలోనే మెడికల్ కళాశాల ఉన్నదని పేర్కొన్నారు. ఇందులో కార్మికుల పిల్లల కోసం ఐదు శాతం రిజర్వేషన్ కల్పించినట్లు చెప్పారు. రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో, పెద్దపల్లిలో మనోహర్ రెడ్డిని 60 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వెంకన్నా.. డౌట్ ఉంటే పోయి కరెంట్ తీగలు పట్టుకో

ఈ రోజు ఒక కాంగ్రెస్ ఆయన అనుమానపడుతున్నడు.. యాడ వస్తుంది 24 గంటల కరెంట్.. ఎక్కడ వస్తుందో చూపెట్టు.. నేను రాజీనామా చేస్తా అంటున్నడు. నేను ఆ కాంగ్రెస్ ఎంపీ వెంకట్‌రెడ్డికి ఒక్కటే చెప్తున్నా.. వెంకన్నా, నీకు బాగా అనుమానం ఉన్నది కదా. మా చెన్నూర్ నియోజకవర్గానికి రా.. ఏ ఊరుకుపోతవో పో.. నీ ఇష్టం ఉన్న సమయానికి రా.. మీ లోకల్ కాంగ్రెస్ వాళ్లందరినీ తీసుకుపో. అందరు కలిసి మీకు బుద్ధి పుట్టిన టైమ్‌కు రండి.. వచ్చి కరెంట్ తీగలు గట్టిగా పట్టుకోండి.. కరెంట్ వస్తుందో లేదో మీకే ఎరుకైతది. దేశానికి దిక్కుమాలిన కాంగ్రెసోళ్ల దరిద్రం కూడా పోతది.

లోకం పోకడ

కేసీఆర్ పథకాలు భేష్

- బీజేపీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రశంస

చొప్పదండి, అక్టోబర్ 1: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ ఎంపీటీసీ సభ్యుడు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రశంసలు కురిపించారు. కేసీఆర్ సర్కారు పార్టీలకతీతంగా పథకాలను వర్తింపజేస్తున్నదని కొనియాడారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేటలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సిద్ధించిన తర్వాతనే పల్లెలన్నీ బాగుపడ్డాయని ప్రశంసించారు. రాగంపేటలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.7°c	23.8°c
నల్లగొండ	36.1°c	23.6°c
ఖమ్మం	34.0°c	24.0°c
రంగారెడ్డి	33.2°c	21.3°c
వరంగల్	33.0°c	24.0°c
మెదక్	32.9°c	21.6°c
మహబూబ్‌నగర్	32.3°c	21.0°c
కరీంనగర్	31.0°c	25.0°c
హైదరాబాద్	30.7°c	23.7°c
నిజామాబాద్	27.0 °c	23.0°c



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కౌశికహరి. చిత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

బీజేపీకి కౌశికహరి గుడ్‌బై

- రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఆ పార్టీ 50 డివిజన్ల అధ్యక్షులూ బీఆర్ఎస్‌లో చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

పెద్దపల్లి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రామగుండంలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. బీజేపీ ముఖ్యనేత, కార్మికవర్గాల్లో పట్టున్న నాయకుడు కౌశికహరి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన రామగుండం దశాబ్ది ప్రగతి సభలో తన సతీమణి, రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ కార్పొరేట్ కౌశిక లతతో కలిసి ఆయన మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారితోపాటు కాంగ్రెస్ రామగుండం కార్పొరేషన్ చైర్మన్, 41వ డివిజన్ కార్పొరేటర్ గాదం విజయ, ఆ పార్టీ 50 డివిజన్ల అధ్యక్షులు, కమిటీ సభ్యులు కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కౌశికహరి 2009 సాధారణ ఎన్నికల్లో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి 1,200 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగి తృతీయ స్థానంలో నిలిచారు. కౌశికహరి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘానికి, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘానికి నాయకత్వం వహిస్తున్నారు.

నమ్మకం కేసీఆర్.. అమ్మకం మోదీ

మొదటిపేజీ తరువాయి...

పేరును అదానీగా మార్చుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల పర్యటనలో భాగంగా నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ.. గోదావరిఖనిలో జరిగిన రామగుండం దశాబ్ది ప్రగతి సభ, పెద్దపల్లిలో జరిగిన ప్రగతి నివేదన సభల్లో పాల్గొని ప్రసంగించారు. ''ప్రధాని మోదీ తెలంగాణకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నడో మాకైతే అర్థం కావడం లేదు. ఆయనొచ్చింది ఓట్ల కోసమే. అప్పట్లో అమరావతికి పోయి తట్టెడు మట్టి.. లొట్టెడు నీళ్లు ఇచ్చిండు. తెలంగాణ కొంగు బంగారం సింగరేణిని అమ్మే ప్రయత్నం చేస్తున్నాడు. రామగుండం వచ్చినప్పుడు సింగరేణిని కాపాడతానని చెప్పినోడు నెల రోజుల్లోపే నాలుగు గనుల ప్రైవేటీకరణకు టెండర్లు పిలిచాడు. కేసీఆర్ రుణమాఫీ చేస్తామని మాట తప్పిండని, అందుకే తెలంగాణ రైతులు చచ్చిపోయిండ్రని ప్రధాని మాట్లాడిండు. నేను ప్రధానమంత్రిని అడుగుతున్న. నీకు కనీస ఇంగితం ఉంటే, నిజంగా ప్రధానివి అయితే వెంటనే మీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం. వాస్తవం ఏమిటంటే.. కరోనా కష్టమొచ్చినా రెండుసార్లు రైతులకు రూ.37 వేల కోట్లను రుణమాఫీ చేసిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే. వాస్తవాలను విస్మరించి ప్రధాని హోదాలో పచ్చి అబద్ధాలు చెప్పొచ్చా. మోదీ వచ్చిన ప్రతిసారీ మరో మాట చెపుతుండు. కేసీఆర్ కుటుంబ పాలన తెలంగాణలో ఉందంటున్నారు. బరాబర్ చెపుతున్నాం.. మాది కుటుంబ పాలనే. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు మా కుటుంబ సభ్యులే. మా అందరి కుటుంబ పెద్ద కేసీఆర్. రాష్ట్రంలోని 13 లక్షల మంది అడపిల్లల పెళ్లి చేసిన మేనమామ కేసీఆర్. రాష్ట్రంలోని 46 లక్షల మందికి పెన్షన్ ఇస్తూ పెద్దకొడుకుగా నిలిచింది కేసీఆర్.. రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చి వాళ్లకు సోదరుడిగా నిలబడింది కేసీఆర్. తెలంగాణలో ప్రతి కుటుంబలో కేసీఆర్ ఒక సభ్యుడు. నీవు ఎన్ని డ్రామాలు చేసినా, ఎన్ని కథలు పడ్డా.. నీ బీజేపీకి డిపాజిట్లు దక్కవు. అయ్యా, ప్రధాని గారు దేశంలోని రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వాలని, ఇందుకు ఆయ్యే ఖర్చు మొత్తం లక్షా నలభై ఐదు వేల కోట్లు మాత్రమే అని చెప్పాం. దీనిపై ప్రధాని ఏమన్నారంటే.. ఉచితం కరెక్టు కాదు.. అట్లజేసుడు మంచిది కాదంటూ సుద్దపూస లెక్క మాట్లాడిండు. మేము కూడా నిజమే అనుకున్నం. లక్షా నలభైఐదు వేల కోట్లు దేశంలోని రైతులకు ఉచిత విద్యుత్తు పేర ఇవ్వడానికి ఆసక్తి చూపకుండా.. దోస్తులకు మాత్రం పద్నాలుగున్నర లక్షల కోట్లు మాఫీ జేసిన దుర్మార్గపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

> బీఆర్ఎస్ అంటే స్కీమ్‌లు.. కాంగ్రెస్ అంటే స్కామ్‌లు.. బీఆర్ఎస్ అంటే తాగు, సాగు నీరు.. కాంగ్రెస్ అంటే కన్నీళ్లు. అందుకే ఎటు దిక్కు ఉంటారో ఆలోచించండి. రైతుబంధు ఇచ్చి పంట వేసే టైం అయ్యిందంటే.. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో టింగ్, టింగ్‌మనుకుంటూ రూ.73 వేల కోట్లు వేసిన రైతుబంధు కేసీఆర్ వైపు ఉందామా.. ఆరు దశాబ్దాలపాటు మనల్ని చావగొట్టి తాగునీరు, కరెంట్ ఇవ్వకుండా పీక్కతిన్న రాబందు కాంగ్రెస్ వైపు ఉందామా..? రైతుబంధు కేసీఆర్ కావాలా.. రాబందు కాంగ్రెస్ కావాలా?
>
> - మంత్రి కేటీఆర్

మోదీ కాదు మొండి.. మొండి కాదు తొండి

మందమర్రిని డీ-నోటిఫై చేసి మున్సిపల్ ఎన్నికలు జరిపించాలనే అంశంపై మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. నిజానికి ఈ అంశం మన చేతుల్లో ఉంటే ఈపాటికి మందమర్రిలో ఒక ఎన్నిక కాదు.. రెండు ఎన్నికలు అయిపోతుండే అని అన్నారు. ''దురదృష్టం ఏంటంటే ఆ ఢిల్లీలో ఉన్న ప్రధాని మోదీ.. ఆయన మోదీ కాదు మొండి.. మొండి కూడా కాదు తొండి.. మనం ఎన్ని చెప్పినా వినడు.. ప్రజలకు పనికి వచ్చే పనులు చెప్పినా వినడు.. మా సింగరేణి కార్మికులకు పనికొచ్చే పనిచెప్పినా వినడు'' అని ధ్వజమెత్తారు. ఈసారి కేంద్రంలో తప్పకుండా సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని, ఒక్కొక్క ఎంపీ మనకు కీలకం అవుతారని పేర్కొన్నారు. మన ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించుకొని ఆ ఢిల్లీ జుట్టు మన చేతిలో పెట్టుకొని సింగరేణిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మంచిర్యాల సభల్లో ఎంపీ వెంకటేశ్ నేత, స్థానిక చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. గోదావరిఖని, పెద్దపల్లి సభల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత తో పాటుగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాలుగు కోట్లమంది మా కుటుంబ సభ్యులే

- బరాబర్ మాది కుటుంబ పాలనే
- మా నాయకుడు కేసీఆర్ కుటుంబపెద్ద!
- ప్రధానికి కేటీఆర్ దీటైన సమాధానం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) బరాబర్ కుటుంబ పార్టీయేనని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలంతా తమ కుటుంబ సభ్యులేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తమ నాయకుడు కేసీఆర్ అని, ఆయనే తమ కుటుంబ పెద్ద అని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ప్రధాని మోదీ బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలపై ఫైర్ అయ్యారు. మోదీ అంటే నమ్మించి మోసం చేయడమేనని ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. పాలమూరు సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం ట్విట్టర్ వేదికగా కేటీఆర్ స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ స్టీరింగ్ కేసీఆర్ చేతిలోనే పదిలంగా ఉన్నదని, కానీ బీజేపీ స్టీరింగ్ అదానీ చేతిలోకి వెళ్లిపోయిందని చురకలంటించారు. కేంద్ర సర్కారు కిసాన్ సమ్మాన్ కింద ఇచ్చింది నామమాత్రమేనని, కానీ.. ఒక చిన్న రాష్ట్రమైన తెలంగాణ కొత్త రాష్ట్రమైనప్పటికీ 70 లక్షల మంది రైతులకు 72 వేల కోట్లను నేరుగా ఖాతాల్లో వేసిన విషయం మీరు తెలుసుకుంటే మంచిదని చెప్పారు. తెలంగాణలో రైతు రుణమాఫీ జరగనే లేదని మోదీ మాట్లాడటం మిలియన్ డాలర్ జోక్ అని ఎద్దేవా చేశారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఒక కొత్త రాష్ట్రం రెండుసార్లు రైతు రుణమాఫీకి నడుం బిగించిన ఏకైక సందర్భం తెలంగాణలోనే ఆవిష్కృతమైందని చెప్పారు. 'అన్నదాత అప్పులు మాఫీ చేసిన జైకిసాన్ ప్రభుత్వం మాది!.. కార్పొరేట్ దోస్తులకు 14.5 లక్షల కోట్ల రుణాలను రద్దుచేసిన ..నై కిసాన్ సర్కారు మీది!' అని మోదీ సర్కారునుద్దేశించి వ్యాఖ్యానించారు. కర్షకుల రక్తం కండ్ల జూసిన రైతు హంతక రాజ్యం మీది.! అంటూ మండిపడ్డారు. ప్రాజెక్టుల వల్ల చుక్క నీరు రాలేదనడం.. మోదీ అవివేకానికి నిదర్శనమని, తెలంగాణలో సాగునీటి విప్లవం సాగుతున్నదని చెప్పారు. 'తెలంగాణ రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేక చేతులెత్తేసిన మీరా మాట్లాడేది' అని మోదీని నిలదీశారు. గిరిజన వర్సిటీ తెలంగాణ హక్కు అని, తొమ్మిదిన్నరేండ్లు తొక్కిపెట్టి.. విభజన చట్టంలోని హామీని తుంగలో తొక్కి.. ఆదివాసీ పిల్లలకు అన్యాయం చేసి..ఇప్పుడేదో ఉద్ధరించినట్టుగా ఫోజులు కొడుతున్నారని మండిపడ్డారు.

అభివృద్ధికి 'తెలంగాణ మోడల్' సాక్ష్యం

- సీఎం కేసీఆర్ సామర్థ్యానికి, దక్షతకు, నిబద్ధతకు నిలువుటద్దం ఈ పుస్తకం
- తెలంగాణ మోడల్ పుస్తకావిష్కరణలో ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్

తెలంగాణ మోడల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో పుస్తక రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, నవలా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ మోడల్' పుస్తకం తమ ప్రభుత్వం సాధించిన విజయ పరంపరకు అక్షర చిహ్నమని మంత్రి కే తారకరామారావు చెప్పారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన తెలంగాణ మోడల్ పుస్తకాన్ని ఆదివారం ప్రగతిభవన్‌లోని కేటీఆర్ కార్యాలయంలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఇది తమ ప్రభుత్వం సాధించిన నేటి విజయమే కాదు, రేపటి విజయాలకు దిక్సూచి అని చెప్పారు. సీఎం కేసీఆర్ దార్శనిక ఆలోచనలతో ప్రవేశపెట్టిన పథకాలు నేడు దేశానికి ఎలా నమూనా అయ్యాయో ఈ పుస్తకంలో గౌరీశంకర్ పొందుపరిచారని కేటీఆర్ చెప్పారు. 'టుడే ఏ రీడర్, టుమారో ఏ లీడర్' అంటారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ సామర్థ్యానికి, దక్షతకు, నిబద్ధతకు నిలువుటద్దం ఈ పుస్తకంలోని ప్రతి పేజీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, నవలా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'నడక' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేటీఆర్

తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలన్నీ కలిపి తీసుకొచ్చిన 'నడక' పుస్తకాన్ని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం ద్వారా దశాబ్ద కాల తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని విశ్లేషించిన తీరును మంత్రి అభినందించారు. దేశ, రాష్ట్ర సామాజిక స్థితిగతులపై ఈ పుస్తకంలో చక్కగా విశ్లేషించారని, కాలానుగుణంగా రాసిన ఈ వ్యాసాలన్నీ తెలంగాణకు సందర్భోచితంగా ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయుడు పరాంకుశం వేణుగోపాల స్వామి, సీనియర్ జర్నలిస్ట్ ఆసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఈఎస్ఐసీలో...

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 1038
- పోస్టులు: ఈసీజీ టెక్నీషియన్, ఓటీ అసిస్టెంట్, జూనియర్ రేడియోగ్రాఫర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 30
- వెబ్‌సైట్: https://esic.gov.in

ఎన్ఐటీటీటీఆర్‌సీలో...

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్‌సీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: టెక్నికల్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు, ఎంపిక, చివరితేదీల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- వెబ్‌సైట్: https://www.nitttrc.ac.in

ఐఎల్‌బీఎస్‌లో...

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ & బయిలరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 88
- పోస్టులు: సీనియర్ రెసిడెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మేనేజర్ (ఐటీ), డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ ఐటీ తదితరాలు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 21
- వెబ్‌సైట్: http://www.ilbs.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- డీఎస్సీ బయాలజీ, గ్రూప్స్ ప్రత్యేకం చరిత్ర, ఐఐటీ/నీట్ ఫౌండేషన్ ఫిజిక్స్, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.